అభివృద్ధి పనుల పరిశీలన



కాప్రాలో పర్యటిస్తున్న జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌పాటిల్‌

కాప్రా: గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేటర్‌ ఎల్బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ బుధవారం కాప్రా డివిజన్‌లో పర్యటించారు. సీఎస్‌నగర్‌, మల్లికార్జుననగర్‌లో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ శివమణి పలు సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని కోరారు. భాస్కర్‌రావునగర్‌లో అంతర్గత రోడ్లు, సైనిక్‌పురి పార్క్‌లో టాయిలెట్ల నిర్మాణం, హైటెన్షన్‌ రోడ్డులో స్ట్రామ్‌ వాటర్‌ డ్రైన్‌ నిర్మాణం, షిరిడీకాలనీలో సీసీరోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. కాప్రా డిప్యూటీ కమిషనర్‌ జగన్‌, ఈఈ నాగేందర్‌, డీఈ బాలకృష్ణ, యూబీడీ మేనేజర్‌ లోకేష్‌ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడిన వారికే సముచిత స్థానం



కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ పరమేశ్వర్‌రెడ్డితో కాంగ్రెస్‌ నేతలు

రామంతాపూర్‌ : రామ్‌రెడ్డినగర్‌కు చెందిన సీనియర్‌ కాంగ్రెస్‌ నేత, వార్డు కమిటీ సభ్యుడు చేవెళ్ల బాలయ్య బుధవారం ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డిని కలిసి హబ్సిగూడ డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా నియామకానికి తన పేరును పరిశీలించి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాను గత 20 ఏళ్లుగా ఉప్పల్‌ సర్కిల్‌లోని కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధికి కృషిచేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికే పార్టీ పదవులు దక్కుతాయని ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న బాలయ్యకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

పెండింగ్‌ పనులు పూర్తి చేయాలి



కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ రాయల్‌ ఎన్‌క్లేవ్‌ లేన్‌ నెంబర్‌–6 వద్ద రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు బుధవారం కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. రాయల్‌ ఎన్‌క్లేవ్‌ లేన్‌ నెంబర్‌–6 యూజీడీ, తాగునీటి పైపులైన్‌ పనులు పూర్తయ్యాయని, ఆ దారిలో రోడ్డు నిర్మించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. స్వప్న, మల్లీశ్వరి, గీత, వైహవి, అనుష, శ్రీకృష్ణ, మంజుల, అనిత, వివేక్‌, మహీంద్ర తదితరులున్నారు.

రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

బోడుప్పల్‌: సీసీరోడ్ల అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ మేడ్చల్‌ నియోజకవర్గ బి–బ్లాక్‌ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్‌ అన్నారు. బోడుప్పల్‌ న్యూ భవానీనగర్‌ కాలనీలో రూ.25లక్షలతో సీసీరోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌ తదితర సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

పహల్గాం ఉగ్రదాడికి నిరసన ర్యాలీ



హరికృష్ణనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అల్వాల్‌: కశ్మీర్‌ పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ మచ్చబొల్లారం హరికృష్ణనగర్‌ నుంచి బొల్లారం రైల్వేగేట్‌ వరకు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. పహల్గాంలో జరిగిన హింసాకాండకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్‌ చేశారు. అనంతరం మృతులకు నివాళులర్పించారు. బీజేపీ నాయకులు కందుకూరి కరుణశ్రీ, మాచర్ల శ్రీనివాస్‌, ఉదయ్‌ప్రకాష్‌, అనురాధ, రమాకాంత్‌, దేవి, కాలనీవాసులు అనిల్‌, సౌజన్య, నితిన్‌, లక్ష్మీ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన పూడికతీత పనులు

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- పనులు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజలు



రామంతాపూర్‌లో కొనసాగుతున్న నాలా పనులు

ఉప్పల్‌: ప్రతి ఏటా జీహెచ్‌ఎంసీ అధికారులు నాలాల పూడికతీతకు రూ. కోట్లు వెచ్చిస్తున్నా.. ఫలితం ఆ స్థాయిలో కనిపించడం లేదు. కాంట్రాక్టర్లపై పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు, సబ్‌ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనులు పూర్తికాకముందే..

పూడికతీత పనులు పూర్తికాక ముందే నాలాలు పూడ్చుకుపోతున్నాయనే విమర్శలు స్థానికుల నుంచి వెలువడుతున్నాయి. దీనికి ఉదాహరణగా ఉప్పల్‌ సర్కిల్‌ను చెప్పుకోవచ్చు.

రూ.191 లక్షల వ్యయంతో..

ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలో చిన్న, పెద్ద అన్నీ నాలాలను కలిపి ప్రీ మాన్‌సూన్‌, పోస్టుమాన్‌సూన్‌ అని రెండు విభాగాలుగా విభజించి ఈ ఏడాదికి జీహెచ్‌ఎంసీ ఉప్పల్‌ సర్కిల్‌ ఆధ్వర్యంలో రూ.191 లక్షల అంచనా వ్యయంతో పనులను ఏజెన్సీ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించారు.

☛ ఉప్పల్‌ సర్కిల్‌లో 35.93 కిలోమీటర్ల మేర డీసిల్టింగ్‌ పనులు చేపట్టాలనే నిబంధన ఉంది. సర్కిల్‌ పరిధిలోని మొత్తం నాలాలను గతంలో డివిజన్ల వారీగా కాంట్రాక్టర్లను టెండర్ల ద్వారా పిలిచి ఎప్పటికప్పుడు మాన్‌సూన్‌ రాకముందే నాలాలకు పూడికతీసి సిద్ధంగా ఉంచే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఒక్కడే కాంట్రాక్టర్‌..

కాంట్రాక్టర్‌ ఒక్కరే కావడంతో సరైన సమయంలో పూడికతీత పనులు పూర్తిచేయకపోతే వర్షాకాలంలో కాలనీలకు ముంపు తప్పదని స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఉప్పల్‌ సర్కిల్‌ వార్డు నంబర్‌–7లో మేజర్‌ నాలా హైకోర్టు కాలనీ నుంచి ఉప్పల్‌ నల్ల చెరువు వరకు దాదాపుగా 5 కిలోమీటర్ల మేర నాలా విస్తరించి ఉంది. గతంలో ఈ నాలాను ఏప్రిల్‌ నెలలోగా పూడిక తీసి సిద్ధం చేసేది. నెల గడిచినా ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు.



నిలిచిపోయిన ఉప్పల్‌ కావేరినగర్‌ నాలా డీసిల్టింగ్‌ పనులు

కాలనీల్లో పలు నాలాల పరిస్థితి ఇంతే..

కాలనీల్లో ఉన్న నాలాలు కళ్యాణపురి, ధర్మపురి సాయిరాంనగర్‌, బ్యాంక్‌కాలనీ, బీరప్పగడ్డ, మల్లికార్జుననగర్‌, న్యూ రాంనగర్‌, కుమ్మరిబస్తీ తదితర లోతట్టు ప్రాంతాల్లో ఇంకా డీసిల్టింగ్‌ పనులు ప్రారంభించలేదని స్థానికులు చెబుతున్నారు. వీటితో పాటు బకెట్‌ మిషనింగ్‌ పనులు కూడా చేయాల్సి ఉందన్నారు.

ఉప్పల్‌ డివిజన్‌ పరిధిలో ఇదే పరిస్థితి..

సూర్యానగర్‌ కాలనీ, హనుమసాయినగర్‌, సాయిబాబా కాలనీ, లక్ష్మారెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో సైతం ఎలాంటి పూడికతీత పనులు మొదలు పెట్టలేదని స్థానికులు వాపోతున్నారు. మేజర్‌ నాలా శ్రీకృష్ణ కాలనీ కమాన్‌, రాయల్‌ ఇన్‌ఫీల్డ్‌ సర్వీస్‌ సెంటర్‌, సరస్వతీనగర్‌ తదితర ప్రాంతాల్లో సైతం పనులు ప్రారంభం కాలేదని విమర్శలున్నాయి.

☛ వార్డు నెంబర్‌– 9 రామంతాపూర్‌ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మేజర్‌ నాలా డీ సిల్టింగ్‌ పనులు ప్రారంభమైనట్లు అధికారులు చెబుతున్నారు. కానీ పూర్తి స్థాయిలో పనులు జరగడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఇంజినీరింగ్‌ అధికారులు పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు

ఎర్లీబర్డ్‌ స్కీమ్‌ పని ఒత్తిడి కారణంగా నాలా పూడికతీత పనులపై దృష్టి సారించలేకపోయాం. వెంటనే పనుల తీరును పర్యవేక్షించి తగిన విధంగా చర్యలు తీసుకుంటాం. సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– ఆంజనేయులు డీసీ ఉప్పల్‌ సర్కిల్‌

ఉచిత కంప్యూటర్‌ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాప్రా: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు క్యాడర్‌ టెక్‌ మహేంద్ర ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్‌ శిక్షణ అందిస్తున్నారు. పలు రకాల కంప్యూటర్‌ కోర్సుల్లో యువతకు శిక్షణ అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 4 నెలల పాటు ఉచితంగా శిక్షణ అందించి కార్పొరేటర్‌ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు టెక్‌ మహేంద్ర ఫౌండేషన్‌ ప్రతినిధి నాగరాజు తెలిపారు. 18 నుంచి 27 ఏళ్లలోపు యువత ఇంటర్‌, డిగ్రీ (పాస్‌ అండ్‌ ఫెయిల్‌) అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల యువత ఈసీఐఎల్‌లోని తమ టెక్‌ మహేంద్రా ఫౌండేషన్‌ కార్యాలయంలో మే 5వ తేదీలోగా దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. మరిన్ని వివరాలకు 9100056583.

పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

అల్వాల్‌: పారిశుద్ధ్య కార్మికులకు సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని అల్వాల్‌ సర్కిల్‌ ఔట్‌సోర్సింగ్‌ ఎంప్లాయీస్‌ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్‌ ఓ ప్రకటనలో తెలిపారు. కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆయన కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల పెంపు, హెల్త్‌ కిట్లు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్‌ ఉద్యోగులకు ఏజెన్సీ వ్యవస్థ ఎత్తివేసి కార్పొరేషన్‌ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు.

కమర్షియల్‌ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకోవాలని..

ఎల్బీనగర్‌ జెడ్సీకి వినతిపత్రం అందజేత



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న గగన్‌కుమార్‌

కాప్రా: ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌లోని జై జవాన్‌కాలనీలోని జీహెచ్‌ఎంసీకి చెందిన 10 కమర్షియల్‌ షెటర్లను అధికారులు స్వాధీనం చేసుకోవాలని సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్‌ జిల్లా కన్వీనర్‌ తాడూరి గగన్‌కుమార్‌ కోరారు. దీనిపై బుధవారం ఎల్బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జై జవాన్‌ కాలనీలో జీహెచ్‌ఎంసీకి చెందిన కమర్షియల్‌ షెటర్లను స్వాధీనం చేసుకోవాలని గతంలో ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చినట్లు గుర్తు చేశారు. తాను చేసిన వినతితో ఉన్నతాధికారులు స్పందిస్తూ 10 కమర్షియల్‌ షెటర్లను కాప్రా ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ వారు స్వాధీనం చేసుకుని ఎస్టేట్‌ అధికారులకు తెలియజేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. 6 నెలలు గడిచినా ఇక్కడి అధికారులు స్పందించకపోవడంతో జోనల్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు గగన్‌కుమార్‌ తెలిపారు. గత 12 ఏళ్లుగా ఈ కమర్షియల్‌ షెటర్ల ద్వారా వస్తున్న ఆదాయం జీహెచ్‌ఎంసీ కోల్పోయిందని, ఇప్పటికైనా సదరు షెటర్లను స్వాధీనం చేసుకుని జీహెచ్‌ఎంసీ తన ఆదాయాన్ని కాపాడుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



రామంతాపూర్‌: నియోజకవర్గ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఆకారపు అరుణ్‌ ఆధ్వర్యంలో హబ్సిగూడ డివిజన్‌ నవరంగ్‌గూడ వాసవీనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యకర్తలు, నేతలు బుధవారం కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మేడ్చల్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న 6 గ్యారంటీల పథకాలకు యువత ఆకర్షితులై పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. గౌతమ్‌కిరణ్‌, గైక్వాడ్‌ కిషోర్‌, విజయ్‌, శరత్‌, అశ్విన్‌, ప్రవీణ్‌, భూపేష్‌, రోహిత్‌ తదితరులున్నారు.

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు వసతుల లేమి !



చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ వద్ద ధర్నాలో ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌

మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ ధర్నా

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వం రూ.450 కోట్ల వ్యయంతో అధునాతన వసతులతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు కనీస వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్‌ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ విమర్శించారు. బుధవారం 'ప్రగతి కోసం ప్రభాకర్‌' అనే నినాదంతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెర్మినల్‌ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ అధికారులు చేసిన వాగ్దానాలను మరిచిపోయారన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా 3 నెలలుగా రైల్వే ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. టెర్మినల్‌కు రహదారులు నిర్మించకుండా అలసత్వం చేయడంతో నిత్యం ట్రాఫిక్‌ సమస్యలతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం రోడ్డు మార్గంలో వీధిదీపాలను కూడా ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నగరంలో ప్రతి డిపో నుంచి చర్లపల్లి రైల్వే టర్మినల్‌కు అనుసంధానంగా బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన టర్మినల్‌కు వసతులు కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి 15 రోజుల గడువును ఇస్తున్నామని, గడువు లోగా వసతులు కల్పించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ వివిధ డివిజన్‌ పార్టీల అధ్యక్షులు చల్ల ప్రభాకర్‌, మునుగంటి రాంప్రదీప్‌, సంధ్యారెడ్డి, శాంతికిరణ్‌, నవీన్‌, సీనియర్‌ నాయకులు నాదం, నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్‌, ఆనంద్‌గౌడ్‌, గణేష్‌ముదిరాజ్‌, వెంకటాచలం, స్వప్న, నాగమణి, గోపాల్‌గౌడ్‌, రవీంద్రసాగర్‌, ప్రకాష్‌ తదితరులున్నారు.

ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



హెచ్‌బీకాలనీలో బసవేశ్వరుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కుషాయిగూడ: వీరశైవుల ఆరాధ్యదైవం మహాత్మా బసవేశ్వర 892వ జయంతి వేడుకలను బుధవారం హెచ్‌బీకాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజంలో అసమానతలపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని పలువురు కొనియాడారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పజ్జూరి పావనీరెడ్డి, బీజేపీ డివిజన్‌ పార్టీ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్‌, కొత్త అంజిరెడ్డి, వంజరి ప్రవీణ్‌ వీరశైవ సమాజం ప్రతినిధులు యావపురం విశ్వనాథం, జ్ఞానేశ్వర్‌, ఈశ్వరయ్య, శివానంద, దేశాయి బండిగౌడ, సిద్ధేశ్వర్‌, శంభులింగం తదితరులు పాల్గొన్నారు.

కాలనీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఏకగ్రీవం

మౌలాలి: మౌలాలి ఫెడరేషన్‌ కాలనీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం ఆఫీసర్స్‌ కాలనీలోని గ్రౌండ్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా చుంకు శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శిగా లోహిత్‌రెడ్డి, కోశాధికారిగా భాస్కర్‌, చీఫ్‌ అడ్వైజర్లుగా వంశీమోహన్‌, ఎలిమినేటి దశరథరెడ్డి, కన్వీనర్‌గా వేంకటేశ్వరావు, ఉపాధ్యక్షులుగా సంపత్‌గౌడ్‌, చతుర్వేదుల శ్రీనివాస్‌, శివాజీ, లోకనాథం, శంకర్‌, సంయుక్త కార్యదర్శులుగా విశ్వనాథ్‌రాజు, రాధాకిషన్‌రావు, కల్చరల్‌ కార్యదర్శిగా సత్యనారాయణ, ఆఫీస్‌ అడ్మినిస్ట్రేటర్‌గా కె. మురళీకృష్ణలను ఎన్నుకున్నారు.

పదోతరగతి ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి పాఠశాల యాజమాన్యం



లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్‌ యాజమాన్యం

అల్వాల్‌: పదోతరగతి ఫలితాల్లో అల్వాల్‌ త్రివేణి పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. హర్షప్రియ 575, జశోద 572, ప్రణవి 564 మార్కులు సాధించగా.. ఆరుగురు విద్యార్థులు 550కి పైగా, 19 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శ్రీసుధ, సీఆర్‌వో వెంకటరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

అల్వాల్‌: పదో తరగతి ఫలితాల్లో ఓల్డ్‌ అల్వాల్‌, టెంపుల్‌ అల్వాల్‌, వెంకటాపురం బ్రాంచీల లిటిల్‌ ఫ్లవర్‌ స్కూల్‌ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం మూడు బ్రాంచీల్లో 114 మంది విద్యార్థులు హాజరు కాగా.. 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో 41 మంది విద్యార్థులు ఏ–1 సాధించారు. అనంతరం విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ కె.సదానంద్‌, ప్రిన్సిపాల్‌ జ్యోతిసదానంద్‌, డైరెక్టర్లు శరత్‌చంద్ర భార్గవ్‌, మానస, సాహితిసదానంద్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ శివలి రాయ్‌, హెడ్‌మాస్టర్‌ లక్కీ శ్యామూల్‌, నాగజ్యోతిలు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

'పది'లో సత్తాచాటిన జెడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థులు

కాప్రా: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో కాప్రాలో గతేడాది 2023–24లో 84 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 81.74 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాప్రా జెడ్పీ స్కూల్‌లో ఇంగ్లిష్‌ మీడియం విద్యార్థి యజ్ఞేశ్వర్‌ 551 మార్కులతో స్కూల్‌ టాపర్‌గా నిలవగా.. తరువాతి స్థానాల్లో విజయదుర్గ (524), యశ్వంత్‌(519), సుమంత్‌(514), హర్షిత (513), హస్సన్‌ (509), చరణ్‌ (506) సాధించారు.

మల్లాపూర్‌: మల్లాపూర్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు 70.4శాతం ఉత్తీర్ణత సాధించారు. 545 మార్కులతో బొప్పాల నాగేశ్వరి స్కూల్‌ టాపర్‌గా నిలిచింది. 543 మార్కులతో కంతాల్‌ నరేందర్‌ రెండో స్థానం, 540 మార్కులతో వరోడా అలేఖ్య మూడో స్థానం సాధించింది.

ఉప్పల్‌: జిల్లా పరిషత్‌ ప్రభుత్వ పాఠశాలలో 137 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 99 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 72.25 శాతం విద్యార్థులు పదిలో ఉత్తీర్ణత సాధించారు. సానా కావేరి 554 మార్కులు సాధించగా.. రాకీశరణ్‌ 534 మార్కులు, బానోతు బిందు 536 మార్కులు సాధించగా సైని సారికకు 500 మార్కులు వచ్చాయి.

చిలుకానగర్‌ ప్రభుత్వ పాఠశాలలో...

ఎంపీహెచ్‌ఎస్‌ ప్రభుత్వ పాఠశాలలో 44 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరు కాగా వారిలో 36 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి తెలిపారు. అక్షయ 540 మార్కులు, సౌమ్య 493, ప్రవీణ్‌ 485 మార్కులు సాధించాడు.

మల్కాజిగిరి/అల్వాల్‌: మండల పరిధిలో 380 మంది విద్యార్థులకు 291 మంది (76.57శాతం) విద్యార్థులు, అల్వాల్‌ మండల పరిధిలో 328 మంది విద్యార్థులకు 248 మంది (75.60 ఉత్తీర్ణులయ్యారు. గతేడాది కంటే ఉత్తీర్ణత శాతం పెరిగింది.

☛ మల్కాజిగిరి మండల పరిధిలో ఎస్‌వీఎస్‌ సాయి విఘ్నేష్‌ 561 మార్కులతో మొదటి స్థానం, కె.గౌతమ్‌ 536 మార్కులతో తృతియస్థానం, జిల్లా పరిషత్‌ బాలికల పాఠశాల మల్కాజిగిరిలో చదువుతున్న సిరివెన్నెల 552 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారు.

☛ అల్వాల్‌ మండల పరిధిలో యాప్రాల్‌కు చెందిన శ్రీరామ్‌ 553 మార్కులతో మొదటి స్థానం, కుషాల్‌ 529 మార్కులతో తృతీయ స్థానం, జిల్లా పరిషత్‌ పాఠశాల మచ్చబొల్లారంలో చదువుతున్న షేక్‌రియాజ్‌ 533 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచాడు.

కుషాయిగూడ: పది ఫలితాల్లో కుషాయిగూడ, చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తెలుగు మీడియంలో (66.67 శాతం) 33 మంది విద్యార్థులు పరీక్షకు హజరు కాగా 22 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లిష్‌ మీడియంలో (72.66 శాతం) 139 మందికి 101 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం ప్రకటించారు. ముత్యాల అక్షిత (547) ముప్పన హాసిని (547) ఆదిత్య (542) సుచిత్ర (532) మహాలక్ష్మి (529) సీహెచ్‌. భావన (529) మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

☛ చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో కపూర్‌ అరుణ్‌కుమార్‌ (520) పల్లవు ఇసాక్‌ (515) తమ్మిడి భార్గవి (499) మార్కులు సాధించినట్లు వివరించారు.

బోడుప్పల్‌లో 82.94 శాతం..

బోడుప్పల్‌: బోడుప్పల్‌ జిల్లాపరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు పది ఫలితాల్లో 82.94 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు పెద్ది దామోదర్‌ వివరించారు. అక్షయ్‌కుమార్‌ 537 మార్కులు, హేమలత 532, అర్షియ షన్ను 527, భరత్‌ 526, శృతి 522, సాయిలహరిప్రియ 519 మార్కులు సాధించగా వారిని హెడ్‌మాస్టర్‌ అభినందించారు.

రామంతాపూర్‌ : రామంతాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్‌ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. టి.అనిత 502, నందు 488, లౌక్య 487 మార్కులు సాధించారు.


యజ్ఞేశ్వర్‌ (551)


నాగేశ్వరి (545)


నరేందర్‌ (543)


అలేఖ్య (540)


సానా కావేరి (554)


రాకీ శరణ్‌ (534)


సానా కావేరి (554)


సైని సారిక (500)


అక్షయ (540)


ఎస్‌. సౌమ్య (493)


ప్రవీణ్‌ (485)


సాయి విఘ్నేష్‌ (561)


సిరివెన్నెల (552)


గౌతమ్‌ (536)


శ్రీరామ్‌ (553)


షేక్‌రియాజ్‌ (533)


కుషాల్‌ (529)